అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాల కరువు 6లో..

అంగరంగ వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం 6లో..

జగిత్యాల పట్టణంలోని బైపాస్ రోడ్డులో సాయిబాబా ఆలయ సమీపంలో ఓ రియల్ ఏస్టేట్ వ్యాపారి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నాడు. సుమారు 14 గుంటల స్థలంలో జరుగుతున్న నిర్మాణంలో అనేక అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. కమర్షియల్ జోన్ పరిధిలో గల స్థలంలో కమర్షియల్ కాంప్లెక్‌ను కడుతున్నప్పటికీ రెసిడెన్షియల్ పర్మిషన్ తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి. అనుమతి ఒక తీరుగా తీసుకొని నిర్మాణం మరో తీరుతో కడుతున్నాడు. అనుమతిలో ఏడు నిర్మాణాలు ఉండగా ప్రస్తుతం జరుగుతున్న పనులు మూడు నిర్మాణాలుగా ఉంటున్నాయి. దీని వల్ల మున్సిపల్ ఆదాయానికి సుమారు రూ. 20 లక్షల గండి పడ్డట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో ఓ కీలక ప్రజాప్రతినిధి తలదూర్చి రూ. లక్షల్లో సెటిల్ మెంట్‌కు ప్రయత్నం, అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్లు వినిపిస్తోంది.

జగిత్యాలలో విద్యానగర్ కాలనీలో ఇరుకైన రహదారిలో ఓ బహుళ అంతస్తుల నిర్మాణం జరుగుతోంది. సంబంధిత యజమాని ఎటువంటి సెట్ బ్యాక్ లేకుండా నిబంధనలు తుంగలో తొక్కి నిర్మాణం చేస్తున్నాడు. ఒక స్లాబ్ నిర్మాణం జరగగానే సెట్ బ్యాక్‌పై కాలనీ వాసులు ఫిర్యాదు చేయడంతో గతంలో మున్సిపల్ అధికారులు అక్రమం జరిగిన మేరకు నిర్మాణాన్ని తొలగించారు. ప్రస్తుతం రెండు, మూడు స్లాబ్‌ల నిర్మాణాలను సెట్ బ్యాక్ నిబంధనలను పాటించకుండా జరుపుతున్నారంటూ ఆరోపణ లు వస్తున్నాయి. ఈ వ్యవహారంపై కొందరు మధ్య వర్తులు ఒప్పందం కుదర్చడానికి ప్రయత్నిస్తున్నారు.

జగిత్యాలలోని హౌజింగ్ బోర్డు కాలనీలో ఓ బిల్డర్ ఓ బల్దియా ప్ర జాప్రతినిధి భాగస్వామ్యంతో బహుళ అంతస్తుల నిర్మాణం చేపడుతున్న ట్లు ప్రచారం ఉంది. సదరు నిర్మాణంలో అక్రమాలు చోటుచేసుకున్నా యంటూ ఇటీవల మున్సిపల్‌లో ఫిర్యాదు అందింది. సంబంధిత స్థల పరిశీలనకు ఇటీవల వెళ్లిన మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులపై ఓ ప్రజా ప్రతినిధి ఒత్తిడి తీసుకవచ్చి ఎటువంటి విచారణ జరగకుండా అడ్డుకు న్న ట్లు ప్రచారం జరుగుతోంది. సదరు నిర్మాణ స్థలంలో సుమారు మూడు గుంటల డివియేషన్ ఉన్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇవి మ చ్చుకు కొన్ని మాత్రమే..ఇలా జగిత్యాల పట్టణంలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి.



అవినీతి అంతస్తులు

- దర్జాగా అక్రమ నిర్మాణాలు
- ప్లాన్‌తో పొంతన లేకుండా కొన్ని...అనుమతి లేకుండానే మరికొన్ని
- నిబంధనలకు విరుద్ధంగా ఇంకొన్ని
- చోద్యం చూస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్
- జగిత్యాలలో రాజకీయ దుమారం రేపిన ఓ అక్రమ నిర్మాణ వ్యవహారం
- చర్చల్లోకి వస్తున్న టౌన్ ప్లానింగ్ అవినీతి, అక్రమాలు

జగిత్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి):జిల్లాలోని మున్సిపాలిటీల్లో అక్రమ నిర్మాణాలు ఇష్టారాజ్యంగా కొనసా గుతున్నాయి. ఆయా పట్టణాల్లో కొత్త కొత్త కాలనీలు వెలుస్తుండడం, ము న్సిపాలిటీ అంతకు అంతగా విస్తరిస్తుండడంతో భవన నిర్మాణాల సంఖ్య పెరుగుతోంది. రోజుకు రోజుకూ విస్తరిస్తున్న జిల్లా కేంద్రమైన జగిత్యాలలో అక్రమ నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. మున్సిపల్‌లో అనుమతి పొందిన ప్లాన్‌తో పొంతన లేకుండా కొన్ని...అసలు అనుమతి తీసుకోకుండా మరికొన్ని..నిబంధనలకు విరుద్ధంగా ఇంకొన్ని నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. రెండు, మూడు రోజులుగా జగిత్యాల పట్టణంలో ఓ అ క్రమ నిర్మాణ వ్యవహారం రాజకీయ దుమారం రేపడం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఏకంగా కలెక్టర్‌ను కలిసి ఎవరికి వారు తమ తమ అభిప్రా యాలను వివరిస్తూ అక్రమ నిర్మా ణాల వ్యవహారంపై ఫిర్యాదులు, ఆరోప ణలు, ప్రత్యారోపణలు చేయ డం రాజకీయ దుమారాన్ని రేపింది. ఇంత జ రుగుతున్న అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన జిల్లా టాస్క్‌ఫోర్స్ చోద్యం చూస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

● విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు...

జగిత్యాల మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కొందరు ప్రజా ప్రతినిధులు రియల్ ఏస్టేట్ వ్యాపా రులుగా, బిల్డర్లుగా, మధ్య వర్తులుగా అవతారమెత్తడంతో అక్రమార్కులు ఆడింది ఆట పాడింది పాటగా తయారైంది. పట్టణ శివారులతో పాటు నడిబొడ్డున గల ప్రధాన రహదారుల వెంట భారీ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ భారీ అంతస్తుల నిర్మాణాల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. కనీస నిబంధనలు పాటించకపోవడం, మున్సి పల్ చట్టం ప్రకారం నిర్మాణాలు చేపట్టకపోవడంతో భారీ అంతస్తుల్లో ఫ్లాట్లను, వాణిజ్య సము దాయాలను కొనుగోలు చేసిన బాధితులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

● నిబంధనలు గాలికి...

మున్సిపాలిటీల్లో భవన నిర్మాణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చే స్తున్న ఆన్‌లైన్ విధానాన్ని సైతం కొందరు అక్రమార్కులు తమకు అను కూలంగా మలుచుకుంటున్నారు. మున్సిపాలిటీల్లో ఎవరైనా నిర్మాణాలు చేపట్టాలంటే అనుమతుల కోసం బీ పాస్ ద్వారా మీ సేవల్లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. జగిత్యాలతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీల్లో నిర్మాణాల కోసం భారీగానే దరఖాస్తులు వస్తు న్నాయి. దరఖాస్తు నుంచే అక్రమాలు, అవినీతి ప్రారంభమవుతోంది. కొం దరు మున్సిపల్ బిల్డింగ్ ప్లానర్స్ మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ రూ. లక్ష ల్లో దండుకుంటున్నారు. కొత్త మున్సిపల్ చట్టం నిబంధనల ప్రకారం 120 గజాల స్థలం ఉన్నవారు ఇళ్ల కట్టుకోవాలంటే 15 మీటర్ల సెట్ బ్యాక్ వది లిపెట్టాలి. రోడ్డు 30 అడుగులు ఉంటే ఇరువైపుల 5 అడుగుల చొప్పున స్థలాన్ని మున్సిపల్‌కు అటాచ్ చేయాల్సి ఉంటుంది. ప్రధాన రహదారి అ యితే ఈ అటాచ్‌మెంట్ ఎక్కువగా ఉంటుంది. వాహనాల పార్కింగ్ కోసం సెల్లార్లు ఏర్పాటు చేస్తూ అందులో వ్యాపార సముదాయాలు నిర్వహి స్తున్నారు. ఎక్కడా కూడా పార్కింగ్ స్థలాలు కనిపించడం లేదు. రెస్టారెం ట్లు, హోటళ్లు, సినిమా హాళ్లు, ఫంక్షన్ హాళ్లు, ఆసుపత్రులు, వ్యాపార స ముదాయాలు, పాఠశాల లు, కళాశాలలు నిర్మాణాలు అయితే నూతన చట్టం ప్రకారం 25 శాతం స్థలాన్ని పార్కింగ్‌కు కేటాయించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. ఇళ్ల మీద వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం పేరుతో స్లాబ్‌లు వేయడం, ఇంటి ముందర వాహన పార్కింగ్ కోసం రహదారులను ఆక్రమిస్తూ షెడ్డులు వేయడం, అనుమతి ఒకటి, రెండు అంతస్తులకు మాత్రమే పొంది అదనంగా అంతస్తులు నిర్మించడం, రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ నిర్మాణాలు చేపట్టడం వంటివి యథేచ్ఛగా జరుగుతున్నాయి.

● రాజకీయ దుమారం రేపిన అక్రమ నిర్మాణం...

ఇటీవల జిల్లా కేంద్రమైన జగిత్యాలలోని 4వ వార్డుల్లో అక్రమ నిర్మాణ వ్యవహారం రాజకీయ దుమారం రేపింది. సదరు వార్డులో అక్రమ నిర్మా ణాలు జరుగుతున్నాయని, వాటిని అధికారులు పరిశీలించి అడ్డుకోవాలని కోరుతూ ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు అందిం చారు. అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధి కారుల తీరుపై సమగ్ర విచారణ చేయాలని, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరుసటి రోజు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, ఇతరులు సైతం కలెక్టర్‌ను కలిసి మరో ఫిర్యాదు అందించారు. ఇదే వ్యవహారంపై రెండు రోజుల క్రి తం బోగ శ్రావణి సైతం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే తీరుపై విమర్శించారు.





కలెక్టర్‌కు ఫిర్యాదు అందిస్తున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్

సమస్యల పరిష్కారానికి 'విద్యుత్ ప్రజావాణి'

ఎస్ఈ సత్యనారాయణ

జగిత్యాల అర్బన్, జూన్ 16: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని అన్ని సెక్షన్, సబ్ డివిజన్, అసిస్టెంట్ ఆఫీస్‌లలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీయర్ సత్యనారాయణ తెలిపారు. టీజీఎన్‌పీడీఎస్ఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని 35 సెక్షన్ ఆఫీసులు, 9 సబ్ డివిజన్ ఆఫీసులు, 5 అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసులలో జగిత్యాల, మెట్‌పల్లి డివిజన్ ఆఫీస్‌లలో విద్యుత్ వినియెగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, జిల్లా సర్కిల్‌లో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విద్యుత్ ప్రజావాణి ద్వారా వినియోగదారుల సమస్యలు, నూతన సర్వీసుల కోసం సమర్పించాల్సిన పత్రాల వివరాలు, విద్యుత్ అధిక బిల్లులు, కేటగిరి మార్పు, ఎక్కువ తక్కువ హెచ్చుతగ్గుల వోల్టేజ్ ఇబ్బందులు, లూజు లైన్లు, ట్రాన్స్‌పార్మర్‌లు, ఫ్యూజులు, కాలిపోయిన ట్రాన్స్‌పార్మర్‌లు, ఆగిపోయిన కరెంటు మీటర్లు తదితర ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు దగ్గరలో ఉన్న ఆఫీస్‌లలో ప్రతి సోమవారం నిర్వహించే విద్యుత్ ప్రజా వాణి కి సమస్యలు దృష్టికి తెచ్చి, సత్వర పరిష్కరించుకోవాలని కోరారు.

కోటేశ్వర స్వామిని దర్శించుకున్న అడిషనల్ ఎస్పీ



ఆశీర్వచనం ఇస్తున్న అర్చకులు

వెల్గటూర్, జూన్ 16: ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటిలింగాల శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామిని ఆదివారం అడిషనల్ ఎస్పీ వినోద్ కుమార్ దర్శించుకున్నారు. స్వామి వారికి అర్చనలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోటి లింగాలను సందర్శించడం సంతోషంగా ఉందన్నారు. శాతవాహనుల కాలం నాటి గర్భ గుడిలోని సైకత లింగ రూపంలో వెలసిన స్వామి వారిని దర్శించుకోవడం ఆనందంగా ఉం దన్నారు. అనంతరం ఆలయ అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వే ష్ శర్మలు ఆయనకు స్వామి వారి శేష వస్త్రం కప్పి ఆశీర్వాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉమా సాగర్ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర టీజీవో సంఘానికి జిల్లా కమిటీ వినతి

జగిత్యాల అర్బన్, జూన్ 16: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) కేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆదివారం హైద్రాబాద్ తరలి వెళ్లి సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలను కేంద్ర రాష్ట్ర కమిటీలకు వివరించినట్లు జిల్లా టీజీవో అధ్యక్షుడు గంగుల సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మామిడి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని శాఖలలో సాధారణ బదిలీలు, ఎన్నికల ముందే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న 4డీఏలను వెంటనే విడుదలయ్యేలా చూడాలని, సీపీఎస్ రద్దు కోసం చర్యలు, అవసరమైతే పోరాటం దిశగా అడుగులు వేయాలని, పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్స్ , సరెండర్ బిల్స్ ఇతర బిల్లులు విడుదల చేయాలని కోరారు. జిల్లాలో ఎన్నికల్లో పనిచేసిన సిబ్బందికి ఒక నెల జీతభత్యాలు ఇప్పించుటకు చర్యలు చేపట్టేలా చొరవ చూపాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ ఎజెండా అంశాలకు సంబంధించి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ జిల్లా తరుపున ఆమోదం తెలపడం జరిగిందన్నారు. పై అంశాలను సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్ జిల్లా అంశాలను తప్పకుండా పరిగణలోకి తీసుకొని తగు చర్యలు తీసుకుంటామని సభా ముఖంగా తెలిపారని జిల్లా బాధ్యులు తెలిపారు.

బక్రీద్ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

జగిత్యాల అర్బన్, జూన్ 16:పవిత్ర బక్రీద్ పండుగను పురస్కరించుకొని జగిత్యాల పట్టణంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల కోసం జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండగ త్యాగానికి ప్రతీక అని, బక్రీద్ రోజున ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి, వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్ చైర్మెన్ గోలి శ్రీనివాస్, నాయకులు అబ్దుల్ ఖాదర్, ఆనంద్‌రావు, హసీబుద్దీన్, ఇథేమాద్ ఉల్ హక్, ఖాజా సుల్తాన్ ఉద్దీన్ అహ్మద్, ఆదిల్ పటేల్, ఫరూక్, ఫరూక్ ఖుస్రో హజారీ, దుమాల రాజ్‌కుమార్ తదితరులున్నారు.

●పట్టణంలోని 11వ వార్డులో నల్ల పోచమ్మ బోనాలకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●పట్టణానికి చెందిన 30వ వార్డు యూత్ అధ్యక్షుడు ఫహాడ్ తండ్రి అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పరామర్శించారు. ఆయన వెంట పట్టణ ఉపాధ్యక్షుడు దుమాల రాజ్‌కుమార్, నాయకులు మోసిన్, జైనోద్దీన్ తదితరులున్నారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా సమియోద్దిన్

జగిత్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా డాక్టర్ సమియోద్దిన్ ఆదివారం బాధ్య తలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎంహెచ్‌వో పుప్పాల శ్రీధర్ సెలవులో వెళ్లడంతో ఇన్‌చార్జి బాధ్యతలను డాక్టర్ సమియోద్దిన్‌కు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డిని, కొత్తగా జిల్లాకు వచ్చిన కలెక్టర్ సత్య ప్రసాద్‌ను కలిసి పూలమొక్క, పుష్పగుచ్ఛం అందించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఎస్సెస్సీ రీ వెరిఫికేషన్‌లో పెరిగిన జీపీఏ

జగిత్యాల అర్బన్, జూన్ 16: ఎస్సెస్సీ పరీక్ష పేపర్‌లో రీ వెరిఫికేషన్ జగిత్యాల విద్యార్థికి మార్కులు పెరిగాయి. పట్టణంలోని సూర్య గ్లోబల్ పాఠశాలకు చెందిన విద్యార్థి నవ్య రాజ్‌కుమార్‌కు ఎస్సెస్సీ ఫలితాలలో సైన్స్ సబ్జెక్ట్‌లో 9జీపీఏ రాగా, ఆ విద్యార్థి ఓవరాల్‌గా 9.8 జీపీఏ వచ్చింది. కాగా తాను రాసిన పరీక్షపై తనకు విశ్వాసం ఉండడంతో విద్యార్థి రీ వెరిఫికేషన్‌కు ఫీజు చెల్లించాడు. దీంతో సైన్స్ పేపర్‌ను రీ వెరిఫికేషన్ చేయగా ఒక మార్కు పెరిగి 10జీపీఏ సాధించినట్లు ఎస్సెస్సీ బోర్డు మెమోను జారీ చేసింది. సూర్యగ్లోబల్ స్కూల్ విద్యార్థికి రీ వెరిఫికేషన్‌లో 10 జీపీఏ రావడంతో విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ బోయినిపెల్లి శ్రీధర్‌రావు, డైరెక్టర్‌లు హరిచరణ్ రావు, మౌనికరావు అభినందించారు.

విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు

జగిత్యాల అర్బన్, జూన్ 16: గౌడ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్(గోపా) జిల్లా శాఖ ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరంలో ఎస్సెస్సీ, ఇంటర్‌లో 90శాతం పైగా మార్కులు సాధించిన గౌడ విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు గౌడ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా బాధ్యులు తెలిపారు. ఈ నెల 17 సోమవారం రోజున ఉదయం 10గంటలకు అందజేస్తామన్నారు. గోపా సభ్యులు, పురస్కారాలకు ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులు గౌడ కుటుంబ సభ్యులు సకాలంలో హాజరు కావాలని సంఘ బాధ్యులు రవీందర్‌గౌడ్, అంబటి రాజయ్య గౌడ్, సత్యనారాయణ గౌడ్‌లు కోరారు.

ఘనంగా గంగా అవతరణ దినోత్సవం

ధర్మపురి, జూన్ 16: ధర్మపురి క్షేత్రంలో గంగా అవతరణ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం దేవస్థానం నుంచి గోదావరి వరకు వేదపండితులు, సిబ్బంది వెళ్లి గోదావరి నదిలో గంగా మాతకు ప్రత్యేక పూజలు చేసి హారతి సమర్పించారు. అనంతరం దొప్పల్లో దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేద పండితులు బొజ్జ రమేష్, ఉప ప్రధాన అర్చకుడు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌గా సత్య ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ సత్య ప్రసాద్‌కు పూలమొక్క అందిస్తున్న యాస్మిన్ భాషా

జగిత్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా బుదుమజ్జి సత్య ప్రసాద్ పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలోని చాంబర్‌లో ఆదివారం బాధ్యతలు స్వీక రించారు. కొత్తగా వచ్చిన కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా పూలమొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. బాధ్యతలు చేపట్టిన కలెక్టర్‌ను జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది కలిసి అభినందించారు.

విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ సత్య ప్రసాద్

జిల్లాలో విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు కలెక్టర్ బుదుమజ్జి సత్య ప్రసాద్ తెలిపారు. ఆదివారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా స్థాని క విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలం లో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. ప్రస్తుతం పాఠశా లల పునః ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థులకు మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలు కల్పించాల్సిన పరిస్థితి ఉందన్నారు. విద్యార్థులకు యూనిఫాం పంపిణీ, పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కుల పంపిణీ తదితర అంశా లపై దృష్టి సారిస్తామన్నారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ఎప్పటి కప్పుడు పకడ్బందీగా అమలు చేస్తూ ప్రజల్లోకి తీసుకవెళ్లి విజయవంతం చేస్తామన్నారు. కొండగట్టు, ధర్మపురి దేవస్థాన అభివృద్ధి, భక్తులకు మరింత సేవలు అందించేలా చర్యలు తీసుకుంటానన్నారు. అధికారులు, ఉద్యోగులను సమన్వయ పరుస్తూ కార్యక్రమాలు సత్ఫలితాలు సాధించేలా కృషి చేస్తానన్నారు. జిల్లా నుంచి వెళ్తున్న జగిత్యాల-కరీంనగర్ రహదారికి భూసేకరణ పనులు, పెర్కిట్-మంచిర్యాల రహదారి నిర్మాణ పనులపై దృష్టి సారిస్తానన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీపీఆర్‌వో భీమ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దామరచర్లలో విద్యుత్ ప్లాంట్ ఎందుకు..?

విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



జగిత్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తర, దక్షిణ తెలంగాణ అంటూ కేసీఆర్ కొత్త నాటకాన్ని తెరపైకి తెస్తున్నాడని...రామగుండంలో కాదని దామరచర్లలో విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు ఎందుకు ముందుకు తెచ్చారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామగుండంలో విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు వ్యవహారం తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రాధాన్యం గల అంశంగా పనిచేసిం దని గుర్తు చేశారు. ఎక్కడయితే బొగ్గు లభ్యత ఉంటుందో అక్కడ విద్యుత్ ప్రాజెక్టు నెలకొల్పాల్సి ఉండగా, ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి పరిస్థితుల్లో విజయవాడలో నెలకొల్పారని గుర్తు చేశారు. దానిని తెలంగాణ వాసులు ఉద్యమ సమయంలో వేలెత్తి చూపారన్నారు. ఉత్తర తెలంగాణలోని రామగుండంలో విద్యుత్ ఉత్పాదన ప్రాజెక్టు నెలకొల్పడానికి అవసరమైన స్థలం, బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ దామరచర్లలో ఏర్పాటుకు ముందుకు వచ్చి ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ అంటూ కొత్త వివాదానికి కేసీఆర్ దారి తీశారని విమర్శించారు. రామగుండం నుంచి దామరచర్ల వరకు బొగ్గు రవాణా చేయడం వల్ల అదనపు ఆర్థిక భారం ప డుతుందన్నారు. విద్యుత్ ఉత్పాదన ప్రాజెక్టులన్నీ ఉత్తర తెలంగాణలోనే ఉన్నా యని, దక్షిణ తెలంగాణలో లేవన్న కారణంతో కేసీఆర్ రామగుండంలో ఏర్పాటు చేయాల్సిన థర్మల్ విద్యుత్ ప్రాజెక్టును దామెరచర్లలో ఏర్పాటు చేయాలంటూ ముందుకు వచ్చారని విమర్శించారు. సోలార్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు వైపు మొగ్గు చూపకుండా కేసీఆర్ థర్మల్ విద్యుత్‌కు ఎందుకు మొగ్గు చూపారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పవర్ కమిషన్ చైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డిని కేసీఆర్ తప్పు పట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌పై ఆరోపణలు చేయడం, న్యాయవ్యవస్థను కేసీఆర్ కించ పరిచినట్లేనన్నారు. నరసింహారెడ్డి అందించే నివేదికపై కేసీఆర్‌కు భయం పట్టుకుం దన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కో ఆర్డినేటర్ జగదీశ్వర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగ భూషణం, జగిత్యాల రూరల్ ఎంపీపీ మహేశ్, జగిత్యాల టౌన్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పిప్పరి అనిత పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, జూన్ 16: ధర్మపురి లక్ష్మీ నరసింహుని సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. జేష్ఠ శుద్ధ దశమి తోడుగా సెలవు దినం కావటం వల్ల క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుండి భక్తులు నేరుగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అను బంధ ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.


స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

విద్యుదాఘాతంతో మూడు ఎడ్లు మృతి

బీర్‌పూర్, జూన్ 16: బీర్‌పూర్ మండలం కండ్లపల్లి గ్రామ శివారులో ఆదివారం ఉదయం విద్యుదాఘాతంతో మూడు ఎడ్లు మృత్యువాత పడ్డాయి. శనివారం రాత్రి ఈదురు గాలులకు తుంగూర్ కండ్లపల్లి గ్రామాల మధ్య ఉన్న విద్యుత్ స్తంభాలు విరిగి పడి పోయాయి. కండ్లపల్లి గ్రామానికి చెందిన నారపాక సుధాకర్, నారపాక లక్ష్మీనారాయణ, పూదరి రాయమల్లుకు సంబంధించిన ఎడ్లు మేత కోసం వెళ్తూ విద్యుత్ వైర్లకు తగలడంతో షాక్ కొట్టి మృతి చెందాయి. విద్యుత్ శాఖ అధికారులు మృతి చెందిన ఎడ్లను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మల్లాపూర్, జూన్ 16: మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన గంధం లింగన్న(50)అను వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంధం లింగన్న కొన్ని రోజుల నుంచి కిడ్నీ సమస్యతో బాధ పడుతున్నాడు. ఈనెల 13న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. లింగన్న భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

» విదేశాలకు భారీ వాహనాల ఎగుమతి
» అదుపులోకి తీసుకున్న వరంగల్ పోలీసులు
» 70 లక్షల విలువైన ఐదు కార్లు స్వాధీనం

మట్వాడ, జూన్ 16: ఫైనాన్షియర్ల ముసుగులో కార్లు, టిప్పర్లు, జేసీబీ వంటి భారీ వాహనాలను మోసపూరితంగా కొనుగోలు చేసి నెదర్లాండ్, దక్షిణాఫ్రికా, కాంబోడియా వంటి దేశాలకు విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి తెలిపారు. ఆదివారం వరంగల్ మట్వాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తురకలకుంట గ్రామానికి చెందిన వరికుప్పల దశరథ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వసంతనగర్ చిన్నదుర్గం సందాన్, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం జగద్గిరిగుట్టకు చెందిన కొశెట్టి రాకేశ్, హైదరాబాద్ సంతోష్‌నగర్ ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జాబీర్‌లు ఈ దందాకు తెరలేపారన్నారు. వీరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో... ఆర్థిక ఇబ్బందుల కారణంగా భారీ వాహనాలు అమ్మకానికి పెట్టుకున్న కొంతమంది యజమానుల నుంచి వాహనాలు కొనుగోలు చేసేవారని చెప్పారు. వాటికి సంబంధించిన ఈఎంఐలు తామే కడతామని నమ్మించేవారన్నారు. అలా కొన్న వాహనాలను ఇతరులకు విక్రయించడమో లేక స్క్రాప్ కింద అమ్మడమో చేసేవారని వివరించారు. అలాగే ముంబాయిలోని కొన్ని బృందాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేవారని డీసీపీ వెల్లడించారు. ముఠా సభ్యులు గతంలో హైదరాబాద్ పోలీసులకు పట్టుబడి సుమారు 16 నెలలు జైలుకు వెళ్లారని, విడుదలయ్యాక కూడా అదే తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. 2023లో వరంగల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సుమారు నాలుగున్నర కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని నెదర్లాండ్, సౌతాఆఫ్రికా, కాంబోడియా లాంటి దేశాలకు ఎగుమతి చేశారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వరంగల్ హనుమాన్‌జంక్షన్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని, 5 కార్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

'నాలా' ఎలా?



(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలి. ధరణి రాక ముందు ఆర్డీవో స్థాయిలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తూ నాలా చార్జీలు వసూలు చేసే వారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో భూముల విలువ ఆధారంగా 5శాతం, జీహెచ్‌ఎంసీ పరిధిలో 9శాతం చొప్పున తీసుకునేవారు. కానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత ధరణిని తీసుకొచ్చిన అప్పటి ప్రభుత్వం.. నాలా చార్జీలు చెల్లించేందుకు తొలుత ఆప్షన్ ఇవ్వలేదు. ఆ తర్వాత ఇచ్చినా.. ధరణిలో నమోదై ఉండి, ఎకరాలు, గుంటల చొప్పున నమోదై ఉన్న భూములకు మాత్రమే అవకాశం కల్పించింది. అనధికార లేఅవుటల్లో గజాల చొప్పున ఓపెన్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అలాంటి ఆప్షన్ లేకుండా పోయింది. ఉదాహరణకు ఒక ఊరి శివారులో వ్యవసాయ భూమి ఉంటే.. ధరణిలో అది ఫలానా సర్వే నంబర్‌లో ఉందని పేర్కొంటూ దాని విస్తీర్ణం ఎకరాలు, గుంటల్లో ఉంటుంది. ప్రస్తుతం ఇలాంటి భూమిని మాత్రమే వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకునే వీలుంది. గతంలోనే లేఅవుట్‌గా మార్చి, సదరు భూమిని గజాల చొప్పున వేర్వేరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి ఉంటే.. ధరణిలో అది హౌసింగ్ సైట్ అనే పేరుతో చూపిస్తోంది. ఇలాంటి భూమికి నాలా చార్జీలు చెల్లించే అవకాశం లేకుండా పోయింది. దీంతో దశాబ్దాల క్రితం భూములు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆప్షన్ లేక సతమతం..

గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లో దశాబ్దాల క్రితమే పెద్దఎత్తున అనధికార లేఅవుట్లు వెలిశాయి. వాటిలో ఓపెన్ ప్లాట్లను వేలాది మంది కొనుగోలు చేశారు. ఆయా స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులకు వెళ్లిన సందర్భంలో భూమి విలువలో ఎల్‌ఆర్‌ఎస్ చార్జీల కింద 30శాతం, నాలా చార్జీల కింద మరికొంత వసూలు చేసే వారు. దీనికితోడు జీహెచ్‌ఎంసీ పరిధిలోనైతే చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) పేరిట చార్జీలు తీసుకునేవారు. అయితే, తెలంగాణ ఏర్పాటు తర్వాత హెచ్‌ఎండీఏలో భవన నిర్మాణ అనుమతుల కోసం వెళ్లినప్పుడు కేవలం ఎల్‌ఆర్‌ఎస్ చార్జీలు మాత్రమే తీసుకుంటున్నారు. సదరు స్థలానికి నాలా చార్జీలు చెల్లించకపోతే.. ఆ ఫీజు చెల్లించి పత్రాన్ని తీసుకురావాలని సూచిస్తున్నారు. ధరణి వచ్చిన తర్వాత గుంటలు, ఎకరాల్లో ఉన్న భూముల కన్వర్షన్‌కు మాత్రమే ఆప్షన్ ఇచ్చిన ప్రభుత్వం... గజాల్లో ఉన్న స్థలాలకు సంబంధించిన ఆప్షన్ ఇవ్వకపోవడంతో చిన్న, మధ్య తరహా డెవలపర్లు, బిల్డర్లు తీవ్రంగా సతమతమవుతున్నారు. ఈ విషయమై గత ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ల ప్రతినిధులు అనేక మార్లు సంప్రదించినా.. ఫలితం దక్కలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి.. గజాల్లో ఉన్న స్థలాలకూ నాలా చార్జీలు తీసుకొని, భవన నిర్మాణ అనుమతులు ఇప్పించాలని వారు కోరుతున్నారు. దీన్ని అమలు చేస్తే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లకుపైగా ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు.

సమస్యను పరిష్కరించాలి

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు పదేళ్లుగా పలుపురు డెవలపర్లు, బిల్డర్లు ప్రయత్నం చేస్తున్నారు. కానీ అనుమతులు రాకపోవడంతో ఆయా స్థలాలన్నీ నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వంలో ధరణి తీసుకొచ్చి అదనపు చార్జీలను విధించి ఆదాయాన్ని పొందేందుకు రకరకాల మార్గాలను అప్పటి అధికారులు అన్వేషించారు. కానీ, ఆదాయం వచ్చే మార్గాలను గాలికి వదిలేసి.. ఉన్న చార్జీలను పెంచే ప్రయత్నం చేశారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి రియల్ ఎస్టేట్ రంగానికి గుదిబండగా మారిన నాలా సమస్యను పరిష్కరించాలి.

- ఎం.ప్రేమ్‌కుమార్,
వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్

164 కిలోల గంజాయి, 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు సీజ్

» వేర్వేరు కేసుల్లో ఏడుగురి అరెస్టు

హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఒడిసా నుంచి హైదరాబాద్‌కు గుట్టుగా గంజాయి తరలిస్తున్న రెండు అంతర్రాష్ట ముఠాలకు చెందిన ఆరుగురిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 164 కిలోల గంజాయి, మూడు కార్లు, ఓ బైక్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పెరుమాళ్ సీసీఎస్‌లో ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మొత్తంలో గంజాయి దిగుమతి అవుతుందనే సమాచారంతో దాడి చేసిన పోలీసులు ఓ ముఠాను పట్టుకుని వారి వద్ద వంద కిలోల గంజాయిని సీజ్ చేశారు. కామారెడ్డి జిల్లా పిట్లాంకు చెందిన ధారావత్ రవి, మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన సయ్యద్ బహదూర్, ఆనంద్ రామ్‌జీ కదమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ప్రధాన నిందితుడు ధారావత్ రవి ఇటీవల ఒడిశా వెళ్లి అక్కడ ఓ రైతు దగ్గర 100 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దానిని 32 ప్యాకెట్లుగా మార్చి బహదూర్, ఆనంద్ రామ్‌జీ సహకారంతో కారులో హైదరాబాద్‌కి తరలించి పోలీసులకు పట్టుబడాడు. మరో కేసులో ఇదే తరహాలో ఒడిసా నుంచి నగరానికి గంజాయి తీసుకొచ్చిన హైదరాబాద్‌కు చెందిన షేక్ సర్వేజ్, అబ్దుల్ రవూఫ్, మహ్మద్ అన్వర్ అరెస్టయ్యారు. వారి నుంచి 64 కిలోల గంజాయిని చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్ గతంలో రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించాడు. ఇటీవల బయటికొచ్చిన పర్వేజ్ ఒడిసా వెళ్లి జైలులో అతనికి పరిచయమైన గంజాయి రైతు దీపక్‌ను కలిశాడు. దీపక్ నుంచి 64 కిలోల గంజాయి తీసుకుని రవూఫ్, అన్వర్‌తో కలిసి హైదరాబాద్‌కు తీసుకొచ్చి పోలీసులకు చిక్కాడు. మరో కేసులో యూపీ నుంచి హైదరాబాద్‌కు గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ పరిధిలో పార్టీలు, ఈవెంట్లలో తనిఖీలు చేసిన ఎక్సైజ్ పోలీసులు 8 మత్తు పదార్థాల ప్యాకెట్లను సీజ్ చేశారు.



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్, ఏసీపీ శ్రీనివాసరావు

ఏఎఫ్‌సీఎస్‌పై నిరాధార ఆరోపణలు: టీజీఎస్ఆర్టీసీ

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం(ఏఎఫ్‌సీఎస్)పై నిరాధార ఆరోపణలు తగదని టీజీఎస్ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకే ఏఎఫ్‌సీఎస్‌ను అమలు చేస్తున్నట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. డిజిటల్ టికెటింగ్ కోసం సాంకేతికను అందిపుచ్చుకునేందుకు కేంద్రం రూ.20.97 కోట్లను విడుదల చేసిందని పేర్కొన్నారు. ఏఎఫ్‌సీఎస్ కోసం 2022 నవంబరు 2న టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఇంటెలిజెంట్ టికెట్ యంత్రాల సరఫరా, డిజిటల్ టికెటింగ్, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, నిర్వహణకు కావాల్సిన సర్వర్లు, మ్యాన్‌పవర్‌పై 'ఛలో' మొబిలిటీకి బాధ్యతలను అప్పగించాలని కమిటీ ప్రతిపాదించినట్లు వివరించారు. బస్సుల్లో యూపీఐ, డెబిట్/క్రెడిట్ కార్డులతో డిజిటల్ పేమెంట్స్, స్మార్ట్‌కార్డ్స్, మొబైల్ టికెట్స్, మొబైల్ బస్‌పాస్ సౌకర్యం కల్పించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుకు మహిళలకు స్మార్ట్‌కార్డ్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు ఛలో మొబిలిటీ అనుభవం ఉపయోగపడుతుందని గుర్తించామన్నారు. దాంతో మార్చి 15న ఛలో మొబిలిటీకి లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్‌వోఐ) ఇచ్చామని తెలిపారు. కొన్ని డిపోల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తామని, అన్ని డిపోల్లో అమలుకు మూడు నెలల సమయం పడుతుందని వివరించారు. అసోం, బిహార్ రాష్ట్రాలతోపాటు.. ముంబై, ఇండోర్, జబల్‌పూర్ నగరాల్లో ఈ వ్యవస్థ కొనసాగుతోందని, ఒక్క ముంబైలోనే ఛలో మొబిలిటీ ద్వారా 11 లక్షల స్మార్ట్‌లు జారీ అయ్యాయని పేర్కొన్నారు.

సైబర్ బాధితులకు రూ.31.29 కోట్లు రికవరీ

» టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.31.29 కోట్ల సొమ్మును రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా తీసుకున్న చర్యల వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీ నుంచి జూన్ 8వ తేదీ వరకు రెండు లోక్‌అదాలత్‌లతో కలిపి రూ.31.29 కోట్లు రికవరీ చేసినట్లు ఆయన వివరించారు. సైబర్ మోసాలకు సంబంధించి నాలుగునెలల్లోనే కోర్టుల్లో 5,142 పిటిషన్లు నమోదు అయ్యాయని తెలిపారు. సైబర్ నేరాలపై టీజీసీఎస్‌బీ తక్షణమే స్పందిస్తూ బాధితుల సొమ్మును సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా చర్యలు తీసుకుంటున్నదని శిఖాగోయల్ చెప్పారు. సైబర్‌నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేస్తున్నప్పటికీ బాధితులకు తిరిగి అందించడంలో ఆలస్యం అవుతోందని ఆయన అన్నారు. ఇలాంటి కేసులను సీఆర్‌పీసీ సెక్షన్ 457 కింద నమోదు చేయడంతో పాటు దర్యాప్తునకు సంబంధించి స్టాండర్డ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)లను తయారు చేసి అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలకు పంపినట్లు శిఖాగోయల్ తెలిపారు.

యువకుడి ఉసురుతీసిన.. ఆన్‌లైన్ బెట్టింగ్

» 3 రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రిలో ఆదివారం మృతి

రామాయంపేట, జూన్ 16: ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం దర్మారం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దొమ్మాట భాను(24) డిగ్రీ పూర్తి చేసి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి రూ.2 లక్షల దాకా నష్టపోయాడు. దీంతో మనస్తాపం చెంది మూడు రోజుల క్రితం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ తెలిపారు.


భాను(ఫైల్)

గంజాయి రహిత రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యం



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

సుల్తానాబాద్, జూన్ 16: డ్రగ్స్, గంజాయిరహిత రాష్ట్రమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క అన్నారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి సమీపంలోని రైస్‌మిల్లులో జరిగిన చిన్నారి హత్యాచారం నేపథ్యంలో ఆదివారం మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి రైస్‌మిల్లును పరిశీలించారు. అనంతరం మంత్రి సీతక్క విలేకరులతో మాట్లాడుతూ గంజాయి తదితర మత్తు పదార్థాల వినియోగం మూలంగా రాష్ట్రంలో ఇలాంటి అఘాయిత్యాలు జరుగుతున్నాయని, రెండు రోజుల క్రితం పెద్దపల్లి జిల్లాలో జరిగిన చిన్నారి ఉదంతం అందరి హృదయాలను కలిచివేసిందన్నారు. గంజాయిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించబోతుందని అన్నారు. గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలు సేవించిన వారు ఆ మత్తులో అనేక అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. రైస్‌మిల్లులో కూడా మత్తు సేవించడం వల్లనే బీహార్‌కు చెందిన కార్మికుడు బాలికను ఎత్తుకెళ్లి చంపేశాడని అన్నారు. తల్లిదండ్రుల వద్ద నిద్రపోతున్న బాలికను ఎత్తుకెళ్లి అత్యాచారం చేసి చంపేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి, తనతోపాటు మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారన్నారు. సీఎం ఆదేశాలతో తాము ఈ ప్రాంతానికి వచ్చామని, బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పోలీస్ అధికారులు తమ పనితనాన్ని మరింత పెంచుకోవాలని, పెట్రోలింగ్ వ్యవస్థను విస్తృతంగా నిర్వహించుకోవాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి మత్తుకు బానిసలైన వారిని గుర్తించి, పనిపాటా లేకుండా మత్తులో మునిగితేలుతున్న వారు ఎక్కడ ఉన్నా వెతికిపట్టి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. నేర ప్రవృత్తి ఉన్న వారిపై నిఘా పెంచాలని, వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు వ్యవస్థను ప్రభుత్వం మరింత పటిష్టం చేస్తుందన్నారు.

ఘనంగా దుర్గా దేవి ఆలయ వార్షికోత్సవం

కోరుట్ల, జూన్ 16: పట్టణంలోని కాలేజీ గ్రౌండ్ నిర్మించిన దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. వేదపండితులు పాలెపు రాంశర్మ, వినయ్ శర్మ మంత్రోచ్చారణల మధ్య సాగింది. అర్చకుడు అమ్మవారికి అర్చన అభిషేకం నిర్వహించారు. గణపతి హోమం, చండిహవన కార్యక్రమాలను నిర్వహించగా కాలనీకి చెందిన మహి ళలు విష్ణుశాస్త్ర, లలిత శాస్త్ర నామ, దుర్గాద్వాత్రింశ నామ శోత్ర పారాయణం చేశారు. అమ్మ వారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకొని అన్న ప్రసాదం స్వీకరించారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఉరివేసుకొని ఒకరి ఆత్మహత్య

మానకొండూర్, జూన్ 16: మండలంలోని కెల్లేడు గ్రామానికి రావుల చంద్రమౌళి (55) అనే వ్యక్తి ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రమౌళి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం తన పొలం వద్ద ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారిపై హత్యాచార ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వం

- బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం
- రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క

సుల్తానాబాద్, జూన్ 16: సుల్తానాబాద్ రైస్ మిల్లుల ప్రాంతంలో ఆరేళ్ల చిన్నారిపై హత్యా చార ఘటనను రాష్ట్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సుల్తానాబాద్ ప్రాంతంలోని ఓ రైస్ మిల్లులో జరిగిన ఘటనను తెలుసుకోవడానికి మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు విజయరమ ణారావు, మక్కాన్‌సింగ్ తదితరులు ఆదివారం సుల్తానాబాద్‌కు వచ్చారు. ఘటనా స్థలాన్ని, రెండు రైస్ మిల్లులను పరిశీలించారు. కార్మిక దంపతులు నిద్రించిన స్థలాన్ని, నిందితుడు చిన్నారిని భుజాన వేసుకొని ఎత్తుకుపోయిన దారిని, నేర ప్రదేశాన్ని, మృతదేహం పడేసిన స్థలాన్ని వారు పరిశీలించారు. నేర ఉదంతం, నిందితుడిని పట్టుకున్న వైనం గురించి రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసు, పెద్దపల్లి డీసీపీ చేతన, ఏసీపీలు రమేష్, కృష్ణ తదితరులు మంత్రులకు వివరించారు. అనంతరం మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు విలేకరులతో మాట్లాడుతూ మిల్లులో పనిచేస్తున్న దంపతుల ఆరేళ్ల పాపను నిద్రలో నుంచి ఎత్తుకెళ్లిన నిందితుడు అత్యాచారం చేసి, హత్య చేసిన సంఘటన అందరినీ కలచివేసిందని, ఇది మానవ ప్రపంచం క్షమించరానిదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చాలా సీరియస్‌గా వ్యవహరించిందని, సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ నిందితుడుని కఠినంగా శిక్షించేలా, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ఆదేశాలు జారీచేశారన్నారు. ఆరేళ్ల పసిపాపను అతిక్రూరంగా చంపిన వ్యక్తి బీహార్‌కు చెందినవాడని, ఈ సంఘటన జరిగిన వెంటనే పోలీసులు అప్రమత్తమై పెద్దఎత్తున తనిఖీలు చేశారని, చివరకు నిందితుడిని పట్టుకున్నారని మంత్రి వివరించారు. చిన్నారిని ఎత్తుకుపోయిన గంటలోనే అత్యాచారం, హత్య జరిగిపోయిందని, అయినా ఆ గంట సమయంలో కూడా పెద్దఎత్తున గాలింపు చర్యలు, పాప ఆచూకీ ప్రయత్నాలు జరుగుతున్న సందర్భంలోనే చిన్నారి మృతదేహం లభ్యమైందని, ఇది అత్యంత బాధాకా రమని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో సంఘటన సమాచారాన్ని తెలుసుకోవడానికి సోదరి మంత్రి సీతక్కతో కలిసి తాను సుల్తానాబాద్ వచ్చామని తెలిపారు. సంఘటన స్థలాన్ని స్వయంగా చూశామని, జరిగిన ఘోరం గురించి సీపీ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకున్నామని అన్నారు. అయితే ఘటన జరిగిన తర్వాత ఎక్కడా కూడా ఆలస్యం కాకుండా పోలీసులు పాప ఆచూకీ కోసం ప్రయత్నించారని, కానీ దురదృష్టవశాత్తు కిరాతకంగా చిన్నారి హత్యకు గురైందని అన్నారు. ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని వెనువెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారని తెలిపారు.


ఘటనపై సీపీ ద్వారా వివరాలు తెలుసుకుంటున్న మంత్రులు

● నిందితుడిపై చట్టపరంగా శిక్ష..

చిన్నారిని అతికిరాతకంగా చంపిన మానవ మృగానికి చట్టపరంగా తగిన శిక్ష పడేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ మేరకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అందుబాటులో ఉన్న ఆధారాలతో చట్టపరంగా నిందితుడిపై చర్యలకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హత్యకు గురైన చిన్నారి తల్లిదండ్రులను కూడా కలిసి వారి నుంచి వివరాలు తెలుసుకుంటామని చెప్పారు.

● ప్రభుత్వ పరంగా చేయూత..

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని, ప్రభుత్వం ద్వారా అందవలసిన ప్రయోజనాలను వారికి కల్పిస్తామని మంత్రులు శ్రీధర్‌బాబు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు ఆధ్వర్యంలో మిల్లు ఓనర్‌తో తక్షణ సాయంగా ఐదున్నర లక్షల రూపాయలు ఇప్పించారని, అలాగే ప్రభుత్వం ద్వారా తక్షణ ఎక్స్‌గ్రేషియా కింద మరో రెండున్నర లక్షల రూపాయలను ఇస్తున్నామని వివరించారు. దాంతో పాటు బాలిక తండ్రికి ప్రభుత్వ పరంగా ఉద్యోగ అవకాశం కల్పిస్తామని, వారి ఏడాది వయస్సు గల మరో చిన్నారి భవిష్యత్తుకు సంబంధించిన బాధ్యతలను కూడా ప్రభుత్వం చూస్తుందని వివరించారు. కాగా మంత్రుల వెంట ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్, రామగుండం సీపీ శ్రీనివాసు, డీసీపీ చేతన, పెద్దపల్లి, రామగుండం ఏసీపీలు కృష్ణ, రమేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రకాష్‌రావు, అన్నయ్యగౌడ్, పన్నాల రాములు, సారయ్యగౌడ్, మహేందర్, సతీష్, అబ్బయ్య, కిషోర్, రైస్‌మిల్లర్లు అశోక్, పల్లా మురళి, కేశవరావు, మారుతి, ప్రసాద్, రాజేశ్ ఉన్నారు.

నేటి నుంచి ఉర్సు ఉత్సవాలు

- ముస్తాబైన బిజిగిరిషరీఫ్ దర్గా
- మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు

జమ్మికుంట రూరల్, జూన్ 16: మండలంలోని బిజిగిరిషరీఫ్‌లో బక్రీద్ సందర్భంగా ప్రారంభమయ్యే ఉర్సు ఉత్సవాలకు హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి దర్గా ముస్తాబైంది. కులమతాలకతీతంగా పెద్ద సంఖ్యలోభక్తులు దర్గాను సందర్శించి ప్రార్థనలు చేయనున్నారు. పవిత్ర మక్కాను సందర్శిస్తే ఎంతటి పుణ్యం ప్రాప్తిస్తుందో ఇంకుషావలి దర్గాను సందర్శిస్తే అంతటి పుణ్యం దక్కుతుందని పూర్వీకులు చెప్పేవారు. ఇంకుషావలి దర్గాలో సోమవారం నుంచి బుధవారం వరకు ఉర్సు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ముతావలి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

● దర్గా ప్రాశస్త్యం..

బిజిగిరిషరీఫ్ దర్గాను 11వ శతాబ్దంలో నిర్మించారు. 864ఏళ్ల సుదీర్ఘ చరిత్ర గల దర్గాలో హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి రహ్మతుల్లాహ్ అలై, ఆయన సోదరుడు హజ్రత్ సయ్యద్ అజ్మత్‌షావలి, వీరి కుమారులు హజ్రత్ సయ్యద్ ముర్తుజాషావలి, హజ్రత్ సయ్యద్ అక్బర్‌షావలి సమాధులున్నాయి. జమ్మికుంట పట్టణానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో విశాలమైన గుట్టలు, ప్రకృతి రమణీయతల ప్రాంతంలో ఈ దర్గా ఉంది. ఇస్లాంతో పాటు అల్లాహ్ సందేశాన్ని దివ్య ఖురాన్‌లోని సూక్తులను వివరిస్తూ అరబ్ దేశం నుంచి వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ హజ్రత్ ఇంకుషావలి బిజిగిరిషరీఫ్‌కు చేరుకున్నాడు. మానవత్వమే విశ్వమతమని చాటే ఇంకుషావలి జీవితకాలం మొత్తాన్ని ఇక్కడే గడిపారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని ఏటా జిల్‌హజ్ మాసంలో 17/06/2024 నుంచి మూడు రోజుల పాటు ఉర్సు నిర్వహిస్తారు. నిష్ఠతో ఉత్సవాల్లో పాల్గొనే భక్తుల కోర్కెలు ఇంకుషావలి తీరుస్తారని ప్రసిద్ధి.

● ఉత్సవాల్లో భాగంగా..

ఉర్సు ఉత్సవాల సందర్భంగా సోమవారం సాయంత్రం గుసుల్ షరీఫ్ కార్యక్రమం నిర్వహిస్తారు. దర్గా ముతావలి మహ్మద్, దర్గా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో చాదర్‌గుల్ కార్యక్రమంలో భాగంగా దర్గా ముజా వర్లు చాదర్లతో సమాధులను అలంకరిస్తారు. బక్రీద్ పర్వదినంలో ముఖ్య ఘట్టమైన షరీఫ్(గ్రంథలేపనం)కు మొల్లపల్లె, పెద్ద బిజిగిరిషరీఫ్ గ్రామాల నుంచి మేళతాళాల మధ్య సంధల్‌ను ఊరేగింపుగా తీసుకువచ్చి సమాధులకు అలంకరిస్తారు. మహ్మద్ ప్రవక్త ఉపదేశాలను ఆలపిస్తూ ఖవ్వాలి జరుపుతారు. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన పర్వీన్ షాహదతి, నాందేడ్‌కు చెందిన మహ్మద్ సలీమ్‌పాషా బృందం ఖవ్వాలి ఆలపించనున్నారు.


ఉత్సవాలకు ముస్తాబైన సయ్యద్ ఇంకుషావలి దర్గా

● దర్గా కమిటీ ఆధ్వర్యంలో..

దర్గా కమిటీ ఆధ్వర్యంలో దర్గా, మినార్లు, చారిత్రక కట్టడాలకు రంగులు వేయించారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, వైద్యం, విద్యుత్, వసతి సౌకర్యాలను దర్గా కమిటీ సభ్యులు ఆదివారం పరిశీలించారు. మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ కనుమళ్ల విజయ, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ తదితరులు హాజరుకానున్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, జూన్ 16: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో పచ్చకాంతుల సంతోష్ (35) అనే పురోహితుడు ఆదివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. సంతోష్ గ్రామంలో పురోహితం చేస్తూ భార్యాపిల్లలను పోషిస్తుండేవాడు. ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్న సంతోష్ జైలు నుంచి బయటకు వచ్చి హైదారాబాద్‌లో ఉంటున్నాడు. అక్కడ పురోహితం చేస్తూ ఒంటరిగా ఉంటూ జల్సాలకు అలవాటు పడ్డాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవడంతో పాటు కుటుంబ సభ్యులతో గొడవలు జరుగుతున్నాయి. పలు మార్లు పంచాయితీ నిర్వహించి పద్ధతి మార్చుకోవాలని పెద్దలు మందలించినా మార్పు రాలేదు. తల్లిదండ్రుల నుంచి వచ్చే ఆస్తి విషయంలో సంతోష్‌కు ఆ కుటుంబ సభ్యులతో తగదా చోటు చేసుకుంది. ఆదివారం హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వచ్చిన ఆయన కుటుంబ సభ్యులతో గొడవకు దిగాడు. భయంతో కుటుంబ సభ్యులు పాత ఇంటి నుంచి కొత్త ఇంటికి వెళ్లిపోయారు. ఓ వైపు ఆర్థిక ఇబ్బందులు, మరో వైపు కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన సంతోష్ పాత ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.


సంతోష్(ఫైల్)

చిన్న వానకే వరదలై పారుతున్న డ్రైనేజీలు

మార్కండేయ నగర్ వాసుల అవస్థలు



మార్కండేయ కాలనీలో వరదలై పారుతున్న డ్రైనేజీలు

జగిత్యాల టౌన్, జూన్ 16 : పట్టణంలోని 20వ వార్డు మార్కండేయ నగర్‌లో గురువారం కురిసిన చిన్న వర్షానికే డ్రైనేజీలు వరదలై పారుతు న్నాయి. ఏళ్లు గడుస్తున్నా పాలకులు తమ సమస్యను పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. యేటా రోడ్లు మొత్తం జలమయమై వరదలు పారుతూ ఒక చిన్న కాలువలాగా ప్రవహిస్తూ ఉంటుంది. కానీ ఇప్పటివరకు రాజకీయ నాయకులుగానీ, అధికారులుగానీ పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి డ్రైనేజీలకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

సేవా కార్యక్రమాలు విస్తరింప చేయాలి

క్లబ్ రీజనల్ చైర్మన్ మహాజన్ జితేందర్



హోంగార్డు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న వాసవి క్లబ్ గ్రేటర్ సభ్యులు

కోరుట్ల, జూన్ 16 : వాసవి క్లబ్ గ్రేటర్ సేవా కార్యక్రమాలు మరింత విస్తరింప చేయాలని క్లబ్ రీజనల్ చైర్మెన్ మహాజన్ జితేందర్ అన్నారు. ఆధివారం పట్టణంలోని వాసవి కళ్యాణ భవనంలో నిర్వహించిన డాన్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా క్లబ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం కార్యక్రమాలను నిర్వహించారు. చిరువ్యాపారులకు తోపుడు బండ్లతో పాటు ఎండ వేడి వర్షానికి తట్టుకునే విధంగా గొడుగులు, విద్యార్థులకు నోటుబుక్కులను అందించారు. పట్టణంలో ట్రాఫిక్ రూల్స్ నిర్వహిస్తున్న హోంగార్డుకు మాస్కును అందించి సన్మానించారు. ఈ సందర్భంగా మహాజన్ జితేందర్ మాట్లాడారు. సామాజిక సేవలో పాల్గొన్ని క్లబ్‌ను మరింత పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు బాల సంతోష్, ఎలిమిళ్ళ మనోజ్, కోత్త సునిల్, నేతి శ్రీకాంత్, రేగోండ మహేష్, ఎల్లంకి శివలతో పాటు వైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నాయకుడు

కొడిమ్యాల, జూన్ 16 : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను కొడిమ్యాల మండల బీజేపీ అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి ఆదివారం ఢిల్లీలోని మినిస్టర్ క్వాటర్‌లో మర్యాద పూర్వకంగా కలిసారు. శాలువా కప్పి సన్మానం చేశారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందించారు. కొడిమ్యాల మండల అభివృద్ధికి కృషి చేయాలని సహాయ మంత్రిని కోరినట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో బీజేపీ బలోపేతానికి కృషి చేసిన సంజయ్‌కుమార్‌ను బీజేపీ శ్రేణులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ప్రజల మధ్య ఉంటు ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మీరు ముందుండాలని మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని కోరినట్లు తెలిపారు.

నష్టపరిహారం అందించాలి

కొడిమ్యాల, జూన్ 16 : పిడుగు పాటు వల్ల మరణించిన మూగ జీవాల మరణాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించే విధంగా చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం కృషి చేయాలని పూడూర్ మాజీ సర్పంచు వెల్ముల రాంరెడ్డి కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పిడుగుపాటుతో గేదెలు, ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, మరణించిన పృడు వైద్యాధికార్లతో పోస్టుమార్టం రిపోర్టును ప్రభుత్వానికి పంపిన నష్టపరి హారం అందక యజమానులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఏడు సంవత్సరాలుగా సంబందవించిన పిడుగుపాటుకు మరణించిన మూగ జీవులకు ఎలాంటి నష్టపరిహారం ప్రభుత్వం అందించలేదన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మెట్‌పల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మల్యాల, జూన్ 16: మల్యాల జడ్పీ ఉన్నత పాఠశాల 1986-87 విద్యా సంవత్సర పదవ తరగతి విద్యార్థులు మల్యాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ పాఠశాల గుర్తులను నెమరువేసుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకొని సమ్మేళనాన్ని ఉత్సహంగా నిర్వహించుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు.

మెట్‌పల్లి : మెట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1993-94 పదో తరగతి చదివిని పూర్వ విద్యార్థులు సమ్మేళనంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా విద్యాబుద్దులు నేర్పిన ప్రధాన ఉపాధ్యాయుడు గంద్ర ఆనంద్‌రావు, ఎల్మీ అశోక్, వెంకేటశ్వర్లు, భాస రాములు, భూమయ్య గురువులను శాలువలతో సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో బూరం లక్ష్మణ్, వడ్డేపల్లి శివకుమార్, అందే శ్రీనివాస్, బింగి యతీశ్వర్, నాగేష్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, రాంపల్లి జగన్, భూమేశ్వర్, రంగు శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం క్రయిస్తే కఠిన చర్యలు

ఎక్సైజ్ సీఐ వినోద్‌రాథోడ్

మెట్‌పల్లి రూరల్, జూన్, 16 : ప్రభుత్వ అనుమతులు లేకుండా అధిక మొత్తంలో మద్యం బయట ప్రైవేటు వ్యక్తులకు సరఫరాల చేసిన, నిల్వ చేసిన, విక్రయాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ వినోద్‌రాథోడ్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని రాజేశ్వరరావుపేట గ్రామ శివారులో అక్రమంగా దాబ నిర్వహిస్తూ అందులో మద్యం నిల్వ చేసిన వచ్చిన వారికి అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారరని సమాచారం మేరకు ఎక్సైజ్ సీఐ ఆదేశాల మేరకు ఎస్సై లక్ష్మణ్‌కుమార్ దాడులు నిర్వహించారు. దాబాలో నిల్వ ఉంచిన సుమారు రూ. 5వేల విలువ గల మద్యంను స్వాధీనం చేసుకోని నిర్వాహకుడు అరేళ్ల చిన్నరాజాగౌడ్ (బొర్రన్న)పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తికి మూడు మద్యం సీసాలకన్నా ఎక్కువ అమ్మకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ హెచ్ కానిస్టేబుల్ అబ్దుల్ మహిద్, కాన్సిస్టేబుల్ రాంచందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కథలాపూర్, జూన్ 16 : మండలంలోని సిరికొండ, దూలూరు గ్రామాల శివారులోని పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నామని ఎస్సై నవీన్ తెలిపారు. నిరంతరాయంగా కొందరు అక్రమార్కులు ఇసుకను దొంగచాటుగా తరలించి విక్రయిస్తున్నట్టు తమకు సమాచారం అందిందని పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పట్టుకున్న ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాల కరువు

● అద్దె భవనాల్లో చిన్నారులకు అసౌకర్యం

● పట్టని పాలకులు.. అరకొర వసతుల మధ్య కొనసాగింపు

మల్యాల, జూన్ 16: అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కరువు అయ్యాయి. గర్భిణులు, బాలింతలు, అయిదేళ్ల లోపు చిన్నారులకు పౌష్టికాహరం అందిస్తూ చిన్నారుల ఆలనపాలన కోసం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలు అరకొర వసతులు, అసౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయి. అయినప్పటికీ సొంత భవనాల నిర్మాణాలపై పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో చిన్నారులతో పాటు లబ్దిదారులు ఇక్కట్లు ఎదుర్కోవల్సిన దుస్థితి నెలకొంది. మల్యాల మండలంలో 57 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఇందులో 15 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మరో 33 అద్దె భవనాల్లో కొనసాగుతుండగా 9 మాత్రం ప్రభుత్వ పాఠశాల గదులు, తదితర చోట్ల పని చేస్తున్నాయి. దీంతో శిథిల పాఠశాల భవనాలు, పాఠశాల కిచెన్ తదితర చోట్ల ఏళ్లుగా అసౌకర్యాల మధ్య కేంద్రాలను నడిపించాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల భవనాలను పిల్లర్ల దశలో, భూమి లెవల్ వరకు నిర్మాణాలు చేపట్టి వదిలిపెట్టారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం పట్టింపులేని తనంతో కేంద్రాలు మొక్కుబడిగా నిర్వహించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

● ప్రభుత్వ పాఠశాలలో గదుల కొరత

గతంలో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాంతాల వారిగా జనాభకు అనుగుణంగా ఏర్పాటు చేయగా ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లోని గదులలో కేంద్రాలనే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడం ఇబ్బందికరంగా మారింది. గ్రామాల్లో రెండు మూడు చోట్ల కొనసాగే కేంద్రాలను గ్రామంలో ఒక్క చోట ఉండే పాఠశాలలో నిర్వహించడం ఇబ్బందికరంగా పరిణమించింది. లబ్దిదారులకు, చిన్నారులకు అది అసౌకర్యంగా మారగా కేంద్రాలు ఎక్కువ ఉన్న చోట ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మల్యాల మండల కేంద్రంలో 12 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించాలంటే 12 గదులు కావాల్సి ఉంటుంది. అంతే కాకుండా గ్రామం మొత్తం లబ్దిదారులు, చిన్నారులు అక్కడకు వచ్చే అవకాశమే ఉండదు. ఇలాంటి ప్రభుత్వ నిర్ణయాల పట్ల పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాంతాల్లోనే సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.



గొల్లపల్లి ప్రభుత్వ పాఠశాల వంట గదిలో అంగన్‌వాడీ కేంద్రం



పదేళ్లుకు పైగా గొల్లపల్లిలో నిర్మాణాలకు పరిమితమైన భవనం

● పాఠశాలల్లో నిర్వహించాలనే ఆదేశాలు ఉన్నాయి

నర్సింగరాణి, సీడీపీవో, ఐసీడీఎస్ ప్రాజెక్ట్-మల్యాల

సొంత భవనాలు లేని చోట ప్రత్యామ్నయ ఏర్పాట్లతో కేంద్రాలను నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాల గదులలో ఇబ్బందులు లేకుండా నిర్వహించాలనే ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. వాటిని కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దూరం ఉన్న ప్రాంతాల్లో అసౌకర్యానికి గురి అవుతున్నట్లు పలువురు లబ్దిదారులు తమ దృష్టికి తీసుకువస్తున్నారు. లబ్దిదారులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం

ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు

జగిత్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరా భవన్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నివాసంలో ఆదివారం ఫాదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేకును జీవన్‌రెడ్డి కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుటుంబంలో తండ్రికి గల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సెక్రటరీ బండ శంకర్, మున్సిపల్ మాజీ చైర్పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్, పీసీసీ సభ్యులు గిరి నాగభూషణం, నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ లీగల్ సెల్ కో ఆర్డినేటర్ జగదీశ్వర్, నాయకులు కొత్త మోహన్, రాధ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

●పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఫాదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలువురు తండ్రులను శాలువలతో సత్కరించారు. జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు హరి అశోక్ కుమార్, గంగాధర్, గంగారాం, సయ్యద్ యాసూఫ్, బుచ్చిరెడ్డి, హన్మంత్‌రెడ్డి, ప్రకాశ్‌రావు, సత్యనారాయణ, భూమాచారి పాల్గొన్నారు.

భీమారం: భీమారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో ఆదివారం ఫాదర్స్ డే వేడుకలను జీర్ఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంగడి జాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.



కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

అంగరంగ వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

పట్టు వస్త్రాలు సమర్పించిన మాజీ ఎమ్మెల్యే దంపతులు

మెట్‌పల్లి, జూన్, 16 : పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహకులు జరిపించారు. ఆదివారం ఆలయంలో స్వామి సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకరణ, అర్చనలు, హారతి కార్యక్రమాలను పురోహితులు జరిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, సరోజ దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం కల్యాణమహోత్సవంలో భాగంగా పుణ్యాహవచనం, విశ్వక్సేన ఆరాధన, అంకురార్పణ, మహా సంకల్పం, కన్యాదానం, మాంగల్య ధారణ, వారణ మాయిరం హారతితో శాస్త్రోక్తంగా స్వామి వారి కల్యాణం మహోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండుగలా నిర్వహించారు.

అశేష సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణ ఘట్టాన్ని తిలకించినంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. కల్యాణం లోపాల్గొన్న భక్తులకు ఆలయాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మహాజన్ నర సింహులు, మంచాల రవీందర్, గంగుల మురళి, మహాజన్ లవ్‌కుమార్, మహా జన్ శివకుమార్, రాజరాజేశ్వరి, మహిళా సేవ మండలి సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.



మెట్‌పల్లిలోని వెంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

పెద్దమ్మతల్లి బోనాల జాతర

మెట్‌పల్లి రూరల్, జూన్, 16 : మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని పెద్దమ్మ తల్లి బోనాల జాతరను ముదిరాజ్‌లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారిని దర్శించుకోని ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అర్చనలు, హారతి కార్యక్రమాలను భక్తులు చేపట్టారు. ముదిరాజ్‌లు ఇంటికోక్క బోనంను భక్తి శ్రద్ధలతో తయారు చేసి జాతరలో పాల్గొన్నారు. బోనంతో పెద్దమ్మ ఆలయం చుట్టు ప్రదిక్షణాలు చేసి అమ్మ వారికి బోనం సర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముదిరాజ్ కుల సంఘం నాయకులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, కుల సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే సత్యం



బోనంతో వెళ్తున్న ఎమ్మెల్యే సత్యం

మల్యాల, జూన్ 16: మండలంలోని ముత్యంపేటలో ఆదివారం ఎస్సీ కాలనీ వాసులు నిర్వహించిన పోచమ్మ బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. మహిళలతో కలిసి బోనం ఎత్తుకొని బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఎమ్మెల్యేను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దారం ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మ్యాక లక్ష్మన్, మల్యాల పోచయ్య, ఆగంతపు వంశీధర్, మిల్త్రి శ్రీనివాస్, కట్కూరి ప్రశాంత్, బండి రవి పాల్గొన్నారు.

కొండగట్టులో మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ పూజలు

మల్యాల, జూన్ 16: మధ్యప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి ఆదివారం కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన నరహరి కుటుంబసభ్యులతో కొండగట్టుకు రాగ ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించగా అధికారులు శాలువతో సత్కరించారు. ఆలయ పర్యవేక్షకులు సునీల్, సీనియర్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్ ఉన్నారు



అంజన్న సన్నిధిలో నరహరి

అడ్లూరిని కలిసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి



అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న సమీయొద్దీన్

ధర్మపురి, జూన్ 16: తెలంగాణ ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆదివారం జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా (డీఎంహెచ్‌వో) బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సమీయొద్దీన్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఉదయం ప్రభుత్వ విప్ తన క్యాంపు కార్యాలయంలో ఉన్న సమయంలో సమీయొద్దీన్ అక్కడే ఉన్న ఆయ నను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా సమీయొద్దీన్‌కు ప్రభుత్వ విప్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలోని అన్ని మండలాల్లో, పట్టణాల్లో రోగులకు వైద్య పరంగా తగు సేవలు అందించేలా చూడాలని ఆయన సూచించారు. ఆయన వెంట జగిత్యాల డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

మెట్‌పల్లి డీఎస్పీ ఉమామేశ్వర్‌రావు

మెట్‌పల్లి, జూన్, 16 : సమాజంలో లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలో లయన్స్ క్లబ్, మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషల్ క్యాన్సర్ హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత మెగా హెల్త్ క్యాంపును డీఎస్పీ ప్రారంభించారు. హెల్త్ క్యాంపులో ఉచితంగా జనరల్ చెకప్, డెంటల్, గైనాజికల్, కార్డియాలజీ, క్యాన్సర్ స్కానింగ్ పరీక్షలను వైద్యులు రణదీర్, స్వప్న, నికిత, సస్మాతి, శిరీష, అనిరుద్‌లు చేశారు. అవసరమైన రోగులకు ఉచిత మందులను అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మెట్‌పల్లి లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని, సేదల ఆరోగ్య సేవా కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలిచిందన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు, కంటి ఆపరేషన్లు, ఉచిత భోజనం, చలివేంద్రాలు, చలికాంలో దుప్పట్లు, ఆర్థిక సహాయం, విద్యార్థులు నోట్ బుక్స్ అందజేయడంతో క్లబ్ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దొంతుల ఆంజనేయులు, వడ్డేపల్లి శ్రీనివాస్, ప్రోహిర్ తుకారం, గడ్డం శంకర్‌రెడ్డి, గంగుల మురళి, మహాజన్ శివకుమార్, ఇల్లేందుల వెంకటేష్, కోటగిరి తిరుమలచారి, గంగాధర్, మురళి, దశరథం, సభ్యులు పాల్గొన్నారు.



మెట్‌పల్లిలోని సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఉమామేశ్వర్‌రావు

నేడు అంబారిపేట, కథలాపూర్‌లో విద్యుత్ ప్రజావాణి

కథలాపూర్, జూన్ 16 : ఈ నెల 17న అంబారిపేట, కథలాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్లలో విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తున్నట్టు ఏఈలు భూమేశ్వర్, జమీల్‌పాషా తెలిపారు. విద్యుత్‌కు సంబంధించి వినియోగదారులు ఎలాంటి సమస్యలు ఉన్నా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. సమస్యలను తమ సిబ్బంది పరిష్కరిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాయికల్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికే ప్రతి సోమవారం నిర్వహించే విద్యుత్ ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల రూరల్ సబ్ డివిజన్ ఏడీఈ హరీష్ తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు విద్యుత్ ప్రజావాణిని నిర్వహించబడునని, కావున రాయికల్, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను ప్రజావాణిలో తెలియజేయాలని కోరారు.

మల్యాల: విద్యుత్ సమస్యల పిర్యాదులు, పరిష్కారం కోసం నేటి నుంచి ప్రతి సోమవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలను మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల సెక్షన్ కార్యాలయంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అందించాలని కోరారు. వినియోగదారులు

'అక్రమ ఇళ్ల నిర్మాణాలను తొలగించాలి'

బీర్‌పూర్, జూన్ 16: జిల్లా కేంద్రంలో అక్రమ ఇండ్ల నిర్మాణాలను తొలగించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరడం సంతోషదాయకమని, వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించాలని మాజీ జడ్పీటీసీ ముక్క శంకర్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న అధికారుల పట్టించుకోక పోవడం బాధాక రమన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పందించిన తీరు బాగా లేదని అక్రమ నిర్మాణాలను ప్రొత్సహిస్తున్నట్లుగానే ఉందన్నారు. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

కథలాపూర్, జూన్ 16 : మండలంలోని తాండ్ర్యాల శివారులో పేకాట ఆడుతున్న 8 మందిని పట్టుకున్నట్టు ఎస్సై నవీన్ తెలిపారు. ఓ రహస్య ప్రదేశంలో మూడు ముక్కలాట ఆడుతున్నట్టు పక్కా సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. వీరి నుంచి రు. 8650లు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు.

సూచనల జారీలో మరింత అధ్యయనం చేయాలి

కొడిమ్యాల, జూన్ 1 : వాతావరణ సూచనల జారీలో వాతావరణ శాస్త్రవేత్తలు మరింత లోతుగా అధ్యయనం చేసి సూచనలు జారీ చేయాలని పూడూర్ మాజీ సర్పంచు వెల్ముల రాంరెడ్డి కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1960 సంవత్సరానికి ముందు కార్తలు, అమవాస్య, పౌర్ణమి, రుతువులను బట్టి వర్షాలను అంచనా వేస్తూ వ్యవసాయం చేసేవారన్నారు. ప్రస్తుతం వాతావరణ శాస్త్రం ఘననీయంగా అభివృద్ది చెందినప్పటికి వర్షాలు కురిసే సమాచారం తారు మారు కావటంతో వ్యవసాయదారులు ఆందోళన చెందుతున్నా రన్నారు. భారీ వర్ష సూచన అని తెలుపుతే చినుకు రాలదన్నారు. వాతావరణం పొడిగా ఉంటుందని ప్రకటిస్తే భారీ వర్షాలు కురుస్తున్నాయన్నారు. వాతావరణ శాస్త్రవేత్తలు వాతావరణ సూచనలు చేయటానికి ముం దు ఎక్కువగా అధ్యయనం చేసినట్లయితే సూచనల ఫలితాలు రైతులకు అనుకూలంగా ఉంటాయన్న అభిప్రాయం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న

కథలాపూర్, జూన్ 16 : మండలంలోని భూషణ రావుపేటకు చెందిన అంబటి లింగం ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలు కాగా గల్ఫ్‌లో ఉన్న పలువురు ఆర్థిక సాయం అందించారు. తీట్ల రాజలింగం రు. 5వేలు, పలువురు గల్ఫ్ కార్మికులు రు. 7 వేల చొప్పున విరాళాలు పోగు చేసు కుని బాధితునికి పంపించారు. ఈ మేరకు ఆదివారం రాజలింగం కుమారుడు మహేశ్ బాధితునికి నగదు అందజేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండో డైరెక్టర్ అంబటి రవి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ తీట్ల శంకర్ ఉన్నారు.